# సింగిల్ పేజీ కథలు

## మా పెరటి జామచెట్టు



"మాస్టారూ! నమస్కారం!

మీరు మరేమీ అనుకోకుండా ఒకసారి రామాపురం వచ్చి వెళ్లండి. ఆర్నెల్లక్రితం మీ యింటిని కొన్నాం కదా... ఆరోజు మొత్తం సొమ్ము చెల్లించి అగ్రిమెంటు రాసుకొన్నాము. మంచిరోజు చూసి నా పేరున రిజిస్టర్ చేయించుకొంటానని చెప్పాను. వచ్చే బుధవారం నాడు మీరు వచ్చి ఆ పని పూర్తిచేసి వెళ్లగలరని ఆశిస్తున్నాను. ఇట్లు-శివరామయ్య."

పోస్ట్‌మేన్ ఇచ్చిన కార్డు తీసుకొని చదవటం పూర్తిచేశాను.

"ఉత్తరం ఎక్కడినుండి వచ్చిందండీ!" లోపల కూరగాయలు తరుగుతూ వున్న పూర్ణ అడిగింది.

"రామాపురం నుండి. మనం యిల్లు అమ్మేశాము గుర్తుందా శివరామయ్యగారికి...ఆయన దగ్గర నుండి.."

"ఇల్లు అప్పుడే స్వాధీనం చేసి వచ్చేశాము కదా.."

"సొమ్ము పూర్తిగా యిచ్చేశారులే. ఇంకా కొంచెం రాతకోతలు మిగిలివున్నాయి. ఆరోజు అగ్రిమెంటే కదా రాసుకొన్నది. ఇప్పుడు రిజిస్టరు చేయించుకోవాలట. దానికి నా సంతకం కావాలి. నన్నోసారి రామాపురం రమ్మంటూ రాశాడు" యింట్లోకి నడుస్తూ చెప్పాను.

"ఆర్నెల్లు అయింది కదండీ..మనం ఆ వూరు వదిలి.."

"ఇంకో పదిరోజులయితే ఆర్నెల్లు పూర్తవుతుంది. ఆరోజు మాట యిచ్చాను. పిలిచినప్పుడు వచ్చి సంతకం చేస్తానని. నువ్ కూడా రారాదూ పూర్ణా..అక్కడ అందర్నీ ఓ మారు చూసినట్లుంటుంది"

"అలాగేనండి. నాక్కూడా మన చుట్టుప్రక్కల వాళ్లంతా కళ్లలో మెదుల్తూవున్నారు..ముఖ్యంగా సావిత్రి, దాని పిల్లలు.." అంది.

పూర్ణ వంట పనిలో నిమగ్నమైంది.

నేను వరండాలోని ఈజీ ఛెయిర్‌లో కూర్చున్నాను.

ఆలోచన్లు ఆర్నెల్ల క్రితానికి వెళ్లాయి.

"ఎందుకు నాన్నా ఈ పాత యింట్లో. దీనిని అమ్మేయండి. మీ గ్రాట్యుటీ సొమ్ముతో, దీనితో టౌన్‌లో మంచి యిల్లు తీసుకుందాం. అక్కడైతే అన్ని వసతులూ వుంటాయి. మాకూ ప్రతిదానికి ఈ మారుమూల ప్రాంతం రావాలంటే యిబ్బందిగా వుంది" పెద్దబ్బాయి ప్రపోజల్. చిన్నబ్బాయి స్ట్రాంగ్‌గా బలపరిచాడు.

తప్పనిసరై యిల్లు బేరం పెట్టాను. మంచి లొకాలిటీ కావటంతో యిల్లు ఎలావున్నా..స్థలం వాల్యుయేషన్ వల్ల మంచి రేటుకే పోయింది. శివరామయ్యగారని స్థానిక వ్యాపారి తీసుకొన్నాడు.

సొమ్ము పూర్తిగా యిస్తూ, "మాస్టారూ! కొద్దిరోజులాగి రిజిస్టర్ చేయించుకొంటాను. మీరు శ్రమ అనుకోకుండా మరోసారి రావాలి.." అన్నాడు శివరామయ్య. నేను సరే అన్నాను.

ఆ యింటితో నాకు దాదాపు అరవై యేళ్ల అనుబంధం. అదెప్పుడు కట్టారో నాకు తెలియదు. నేను ఆ యింట్లోనే పుట్టాను. అరవై యేళ్ళు అందులోనే గడిపాను. తెల్లసున్నం కట్టుబడి, బంగాళాపెంకుల కప్పు. అది కట్టినప్పటికి మా నాన్నకీ పెళ్లి కాలేదని చెపుతూ వుండేవాడు. నా హయాంలో రెండుసార్లు కొద్దిపాటి మరమ్మతులు చేయించాను.

అక్కడే పుట్టిపెరిగిన నాకు ఆర్నెల్లనాడు ఆ యింటి అనుబంధం తెగిపోయింది.

"ఏవండీ! మన పెరట్లోని జామచెట్టు యిప్పుడు కాయలు కాసి వుంటుందా? ఎన్ని రోజులైందో తిని.." యింట్లోంచి అంది పూర్ణ.

అవును. మా పెరటి జామచెట్టు కాయలు ఎంత తీపో! మళ్లీ మళ్లీ తినాలనిపించే తీపిదనం. కొబ్బరిలా కరకరలాడుతూ వుండేవి.

ఆ జామచెట్టును మా ఆవిడే వేసి పెంచింది. ఓసారి తను పుట్టింటి నుండి వస్తూన్నప్పుడు ఆ వూరి స్నేహితురాలు యిచ్చిందట. ఆవిడ గుర్తుగా పెంచుతున్నాను అంటూండేది.

జామచెట్టు పెరిగి పెద్దదై పిందెలు వేసినప్పుడు చూడాలి ఆమె ఆనందం. నెలలు నిండి పండంటి బిడ్డని చూసి కన్నతల్లి పొందే ఆనందం పొందింది.

తొలికాయ తెచ్చి, ప్రేమతో నా నోట్లో పెడుతూ, "తినండి..యిది మన పెరటి జామచెట్టుదండీ.." అంటూంటే..ఆవిడ కళ్ళు ఆనందంతో చెమర్చటం గమనించాను.

చెట్టు పెరిగి బాగా కొమ్మలు వేసింది.

కొమ్మలనిండా కాయలు! చెట్టుకిందే మంచం వేసుకొని పడుకొని గంటల తరబడి జామకాయలు చూస్తూ గడిపేది.

ఒకసారనుకొంటా..పెద్ద తుపాను వచ్చింది. గాలికి జామచెట్టు కొమ్మలు విరిగిపోయాయి. పూత, పిందె రాలిపోయింది.

తుపాను గాలికి చెట్టు ఎంత అల్లాడిపోయిందో తెలియదుగాని..ఆ దృశ్యం చూసిన ఆవిడ అల్లాడిపోయిన వైనం నాకు యింకా గుర్తుంది. ఒక రోజంతా అన్నం, నీళ్లు ముట్టకుండా రోదించింది.

ఇలా చెప్పుకుంటూ పోతే మా ఆవిడకు, మా పెరటి జామచెట్టుకు వుండే అనుబంధం ఒక గంటలో, ఒక రోజులో అయిపోయేది కాదు. అది సంవత్సరాల అనుబంధం.

"వంటయింది. భోజనానికి రండి" పూర్ణ పిలుపుతో లేచి యింట్లోకి నడిచాను.

★ ★ ★

బస్టాండ్‌లో బస్ ఆగింది. నేనూ, పూర్ణా బస్సు దిగాము. శివరామయ్యగారి అబ్బాయి దగ్గరకు వచ్చి, "రండి మాస్టారూ!" అంటూ పిలిచాడు. అతని వెంట బయలుదేరాం.

శివరామయ్య యింటికి చేరాము. ఆ మాట, యీ మాటా అయ్యేసరికి పన్నెండు గంటలు దాటింది. భోజనాలు అయినాయి. "మాస్టారూ! నాన్నగారు మిమ్మల్ని తీసుకొని రమ్మన్నారు. ఆఫీసులో డాక్యుమెంట్లన్నీ రెడీ అయిపోయాయిట" అంటూ వచ్చాడు శివరామయ్య గారి అబ్బాయి.

బైక్ మీద ఆ అబ్బాయితో పాటు రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లాను. రామాపురం తాలూకా హెడ్ క్వార్టర్. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసువుంది. పది నిముషాల్లో పని ముగిసింది. తిరిగి యింటికి బయలుదేరాం.

"బాబూ! మా పాత యింటివైపుగా వెళదాం పద.." అన్నాను బైక్ ఎక్కుతూ. ఆ అబ్బాయి బైక్ స్టార్ట్ చేసి మా పాత యింటివైపుగా పోనిచ్చాడు.

* * *

"పూర్ణా...రెడీ అవు..బస్సు టైమ్ అవుతూంది" అన్నాను బైక్ దిగి యింట్లోకొస్తూ.

"అదేంటండీ..మన పాత యిల్లు చూడకుండానే.."

"ఇంకా మన యిల్లేంటే..పిచ్చిదానా! ఆర్నెల్లక్రితం అమ్మేశాము. ఋణానుబంధం తీరినవాటిని చూడకూడదు..పదా.." అన్నాను.

"సావిత్రి..దాని పిల్లలు"

"సావిత్రి..దాని పిల్లలు ఎప్పుడో అత్తగారింటికి వెళ్లార్ట. పెళ్లయిన పిల్ల యిక్కడ ఎందుకుంటుందే.."

బస్టాండ్‌కు వచ్చి బస్సెక్కాము. పూర్ణ సీరియస్‌గా వుంది మూతి బిగించుకొని...అటుగా చూస్తూ కూర్చుంది. నాకు తెలుసు పూర్ణకి ఎంత కోపం వచ్చిందో..పాత యింటికి తీసుకుపోలేదని.

పాత యింట్లో ఏముందని చూపించాలి పూర్ణకి. కొత్త యిల్లు కట్టుకోవటానికి వీలుగా పాత యింటిని పూర్తిగా కూల్చివేశారు. తను ఎంతో ప్రేమతో పెంచుకున్న మా పెరటి జామచెట్టు లేని ఆ యింటిని చూసి పూర్ణ భరించగలదా..!

ఆమె వూహల్లోని జామచెట్టు స్మృతి అలాగే నిల్చిపోవాలి. నాటి దృశ్యమే...ఆమె మదిలో వుండిపోవాలి!

బస్సులో టేప్ రికార్డర్ ఆన్ అయింది. 'మా పెరటి జాంచెట్టు.." పై పాట విన్పిస్తూంది. పూర్ణ నా వంక చూసింది. నా కళ్లలోని ఆర్ద్రతను పసిగట్టింది.

"నాకు అర్థమైందండీ..మీరు నాకు మన పాతయిల్లు ఎందుకు చూపించలేదో!" అంది.

ముప్ఫయి అయిదు సంవత్సరాల సుదీర్ఘ అనుబంధం మాది. నా మనసు అర్థం చేసుకోలేని యిల్లాలు కాదామె.

గంభీరంగా తలూపాను.

**-కైపు ఆదిశేషారెడ్డి** (పొదలకూరు)

# సాయం

బ్యాంకులో డి.డి. తీసేందుకు వెళ్ళిన నేను వోచరు ఫిలప్ చేసి డబ్బు కట్టేసి డి.డి. ఇష్యూ కౌంటర్ వద్దకెళ్ళాను. అప్పటికే చాంతాడంత క్యూ పేరుకుపోయి వుందక్కడ. క్యూ అంత త్వరగా ముందుకెళ్ళడం లేదు.

కంప్యూటర్‌లో డిటయిల్స్ ఫీడ్ చేసి ప్రింట్ కాగానే వాటిమీద పై అధికారితో సిగ్నేచర్ పెట్టించి ఇష్యూ చేస్తున్నారు కౌంటర్‌లో వున్న ఉద్యోగి. ఈ తతంగం అంతా కొంచెం నెమ్మదిగా నడుస్తుండడంతో క్యూలో వున్న కస్టమర్లలో అసహనం పెరిగిపోతోంది. ఒకరిద్దరు కస్టమర్లు వారి అవహనాన్ని అక్కడి ఉద్యోగి మీద ప్రదర్శిస్తూనే వున్నారు.

నా పరిస్థితీ అసహనంగానే వుంది. కానీ ఆ కౌంటర్‌లో వున్న ఉద్యోగిని చూస్తే ఏమీ అనలేకపోతున్నాను. ఎందుకంటే పని త్వరత్వరగా ముగించేయాలన్న ఆరాటంతో శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు ఆయన. ఆ స్థానంలో మరెవరున్నా అంతకంటే త్వరగా అవ్వడం సాధ్యం కాదనిపించింది ఆయన పనిని చూసిన నాకు.

రిటైర్మెంట్‌కు దగ్గర పడ్డ వ్యక్తిలా పెద్ద వయసులో వున్నాడాయన. మధ్యమధ్యలో కళ్ళజోడు సరిచేసుకుంటూ కంప్యూటర్ స్క్రీన్‌ను సునిశితంగా పరిశీలిస్తూ పనిచేస్తున్నాడాయన.

రాను రాను కస్టమర్ల గొడవ మరీ ఎక్కువయిపోతోంది.

అంతలో అక్కడికొచ్చిన మేనేజరు "రామచంద్రయ్యగారూ ఈరోజు కొంచెం ఫ్లో ఎక్కువగా వున్నట్లుంది. ఆలస్యం చేయకుండా త్వరగా కానీయండి. మరెవరికైనా ఈ వర్క్ ఎలాట్ చేద్దామంటే ఎవరి పనులు వారికున్నాయాయె" అంటూ కస్టమర్స్ వైపు చూసి 'అయిపోతుంది కాస్త ఓపిక పట్టండి' అని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఈ ముసలాడు కృష్ణా రామ అనుకుంటూ ఏ వియ్యారెస్సో తీసుకొని ఇంట్లో కూర్చోక ఏం బావుకుందామనో" ప్రక్క కౌంటర్లో వున్న ఇద్దరు యువకులు అంటున్న మాటలు నాకూ స్పష్టంగా వినిపించాయి.

రామచంద్రయ్యగారికి కూడా వినిపించి వుండొచ్చు. కొద్దిపాటి చిరునవ్వుతో వాళ్ళవైపు ఒకసారి చూసి పనిలో మునిగిపోయాడాయన. ఆ చూపులో 'మీ వయసు మొత్తం నా అనుభవమంత వుండదన్న' అర్థం స్ఫురించింది నాకు.

మరికొద్దిసేపటి తర్వాత అక్కడికొచ్చిన మేనేజరు కస్టమర్స్‌తో "యాక్చువల్‌గా డైలీ డి.డి. కౌంటర్‌లో ఇంత రష్ వుండదు. ఈరోజు బాగా రష్ వుంది. కాబట్టి కాస్త ఓపిక పట్టండి. అయిపోతుంది" అంటూ సర్దిచెప్పి, ప్రక్క సీట్లో వున్న ఉద్యోగితో "మిస్టర్ కమలాకర్, మీరు కొంతసేపు ఈ వర్క్ షేర్ చేసుకోవచ్చు కదా" అన్నాడు.

"నాకు నిన్నటి వర్క్ కొంత పెండింగ్ వుంది. ఇవాళ వర్క్ అలాగే వుంది. ఓవర్ లోడ్ అవుతుంది సార్" బదులిచ్చాడు కమలాకర్.

మారు మాట్లాడకుండా అక్కడనుండి వెళ్ళిపోయాడు మేనేజరు.

ఉద్యోగులందరూ అటెండరందించిన టీ త్రాగుతూ ముచ్చట్లలో పడ్డారు. తనకు టీ ఇవ్వడానికొచ్చిన అటెండర్‌ను 'తర్వాత ఇద్దువు' అంటూ పంపేసి తన పని కంటిన్యూ చేసుకొస్తున్నాడు రామచంద్రయ్యగారు. నాకు కొంచెం జాలి కలిగింది.

కొద్ది నిముషాల తర్వాత అక్కడి ఉద్యోగిని ఒకామె టీ కప్పుతో రామచంద్రయ్యగారి సీటు వద్దకొచ్చి కప్పు అందించబోయింది.

"ఏమిటమ్మా శ్రీవల్లి మీరు తీసుకొచ్చారు. వద్దమ్మా తర్వాత తీసుకుంటాను" బదులిచ్చారు రామచంద్రయ్యగారు.

"ఫర్వాలేదు. మీరు కొద్దిసేపు టీ త్రాగుతూ ప్రక్కన కూర్చోండి. ఈ పనిని నేను కంటిన్యూ చేస్తాను"

"లేదమ్మా మీకెందుకు శ్రమ. నేను చేసేస్తాను"

"నాకు వర్క్ లోడ్ ఎక్కువున్నప్పుడు మీరు సాయం చేద్దురు. ప్రస్తుతానికి నన్ను ఈ పని చేయనివ్వండి"

మౌనంగా ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని ఆమె తీసిచ్చిన ప్రింటవుట్స్ తీసుకుంటూ మిగతా వర్క్ పూర్తిచేసి కస్టమర్స్‌కి ఇచ్చేయసాగాడు రామచంద్రయ్యగారు.

క్యూ త్వరగా కదలిపోతోంది. అది గమనించి అక్కడికొచ్చిన మేనేజరు, తగ్గిపోయిన క్యూను చూసి ఆ వెంటనే రామచంద్రయ్యగారికి సాయపడుతున్న శ్రీవల్లి వైపు ఆనందంగా చూసి వెళ్ళిపోయాడు.

"మేడమ్ ఇక్కడ మీరు సేవాకార్యక్రమాలు చేస్తూ కూర్చుంటే మీ వర్క్ పెండింగ్ పడిపోతుంది కదా?" ప్రశ్నించాడు కమలాకర్.

"అలాగని సాటి మనిషికి, అందునా మన తండ్రి వయసున్న పెద్దాయనకు సాయం చేయకుండా ఉండటం మానవత్వమనిపించుకుంటుందా? వర్క్ పెండింగయితే మరో గంట ఎక్స్‌ట్రా వర్క్ చేస్తే అయిపోతుంది. కస్టమర్స్ దగ్గర మన బ్యాంక్‌కు బ్యాడ్‌నేమ్ రాకుండా వుంటుంది" బదులిచ్చింది శ్రీవల్లి.

ఆమె మాటలు వింటూ ముచ్చటగా ఆమె వైపు చూస్తున్నాడు రామచంద్రయ్యగారు, అచ్చం బిడ్డ వైపు మమకారంతో చూస్తున్న తండ్రిలా.

"అమ్మయినా అడగందే అన్నం పెట్టదట. నాకు మాత్రం ఈ అమ్మ అడక్కుండానే సాయపడుతోంది. థాంక్సమ్మా శ్రీవల్లీ" కృతజ్ఞతా భావంతో ఆమె వైపు చూస్తూ అంటున్నాడు రామచంద్రయ్యగారు.

వారి సంభాషణ వింటున్న నాకు అనుకోకుండా కళ్ళు చెమ్మగిల్లాయి.

"చూడమ్మా శ్రీవల్లి! నీ వర్క్‌లో నేనూ సాయపడతాను. త్వరగా పూర్తి చేసేయొచ్చు. ఏమంటావ్" అడిగాడు రామచంద్రయ్యగారు.

"అలాగే..తప్పకుండా" నవ్వుతూ బదులిచ్చింది శ్రీవల్లి.

**-మాణిక్యాల శ్రీనివాసరావు** (హైదరాబాద్)